



# అబద్ధం

కొండేపూడి నిర్మల

చాలా అసంకల్పితంగా అబద్ధం ఆడేశాను. తీరా ఆడేశాక అది ఒక అవసరం కోసం నోటికి వచ్చిందో, అంతర్గతమైన కోరిక మూలాన వచ్చిందో, ఏటికి ఎదురీదలేని నిస్సహాయత వల్ల వచ్చిందో తేల్చుకోలేకుండా వున్నాను.

కారణం మటుకు వాడే. వాడి మొహం మండ. పదిహేను హత్యలు చేసిన ముద్దాయిని నిలదీసినట్టు ఇవాళా నన్ను నిలదియ్యకపోతే అసలంత అబద్ధం చెప్పాల్సిన పనే వుండేది కాదు.

ఛఛ ఎలాంటి పని చేశాను. తట్టుకోలేనట్టు తల విదిలించి పక్కకి వొత్తిగిల్లాను. పక్కింట్లో గడియారం గంటలు కొట్టడం మొదలెట్టింది. వింటూ లెక్కెట్టాను. పదకొండుసార్లు మొత్తుకుంది. అన్నం తినలేదని అప్పుడు గుర్తొచ్చింది. ఎవరిక్కావాలి నేను అన్నం తినక పోతే, మూతి బిగించాను.

'సునందా! లేమ్మా లే అన్నం తిను. లంచ్ కూడా సరిగా చెయ్యలేదివాళ.' ఎడంచెయ్యి కుడి భుజాన్ని తట్టింది. కుడిభుజం బద్ధకంగా చెయ్యి చాపి, 'ఇప్పు డొద్దమ్మా ఓపిక లేదు,' అనేసి వూరుకుంది. నాకీ ద్విపాత్రాభినయం ఎప్పుడూ అలవాటే. ఎవరూ లేరు- అనే ఫీలింగ్ వచ్చినప్పుడల్లా గొంతు మార్చి ఓదార్చు కోవడం హెచ్చరించుకోవడం మామూలే.

బబ్లూ నిద్రలో ఎందుకో నవ్వుతున్నాడు. ఏం కలొచ్చిందో పిచ్చికన్నా! వాడి చేతిలో వున్న రోబోట్ బొమ్మ మంచం కిందికి పెట్టి దగ్గరగా జరిగాను. చల్లగా వుంది వొళ్లు. చలిగాల్లో తెగ తిరిగినట్టున్నాడు. ఫాన్ స్పీడ్ తగ్గించి పొట్టమీద వేసుకుని జోకొట్టాను. కాసేపటికి వొళ్లు వెచ్చబడింది. వీడి మొహం చూస్తుంటే ఒక్కోసారి ఎంత ధైర్యం వస్తుందో ఒకోసారి అంత దిగులు వేస్తుంది.

"అమ్మా మన డాడీ ఏరీ ఎప్పుడూ రారేం?" అనడుగుతాడు వాడు.

"లేడమ్మా రాడు. డాడీకి మనకీ దోస్తీ కటాఫ్," అంటాను. వాడికా మాట నచ్చదు.

"పోన్లేమ్మా రమ్మందాం," బతిమాలుతాడు. ప్రాణం వుసూరుమంటుంది.

"వస్తార్లేమ్మా నువు పెద్దయేలోపు వచ్చేస్తారు సరేనా," రాజీకొస్తాను చేసేదిలేక.

'జాలి ఔనా సునందా,' కళ్లెగరేస్తుంది అద్దంలో ప్రతిబింబం.

'వద్దు వద్దు వాడు రాకూడదు,' భయంతో కళ్లు మూసుకుంటాను.

పిల్లలకి డాడీలు అంత అవసరమా?

అస్తమానూ తిడుతూ కొడుతూ, "పోవే, పో మీ పుట్టింటికి పోయి డబ్బులు పట్రా," అనే డాడీలు-

"ఛీ అంత నల్లగా ఎలకపిల్లలా వున్నాడేమిటి? నా కొడుకేనంటావా?" ఛీత్కరించే డాడీలు-

డాడీ ఎవరో తెలీకపోవడం కంటే డాడీ ఎలాంటి వాడో తెలిసిపోడం ట్రాజడీ కాదా? అలాంటి ట్రాజడీ నుంచి వూహ తెలిసేలోపే నేను వీడ్ని రక్షించినట్టు కాదా?

డాడీ కోసం వాడు చూసే ఎదురుచూపు ముందు నా ప్రేమ, శ్రమ, ఊపిరి, ఒంటరిపోరాటం అన్నీ... అన్నీ తలొంచాల్సిందేనా!? హటాత్తుగా పొద్దుటి అబద్ధం గుర్తొచ్చింది.

ఔను. అభం శుభం తెలీని వర్మని బబ్లూకి డాడీ అని ఎంత అవసరం కోసం చెప్పినా అది తప్పే.

'ఛీ. ఎందుకలా చెప్పావే సునందా?' తిట్టుకున్నాను.

'ఇంటివాడలా నోటికొచ్చినట్టు మాట్లాడ్డం బావుందా మరి,' జవాబు చెప్పుకున్నాను.

"ఎప్పుడొస్తాడమ్మా మీ ఆయన. ఇదిగో అదిగో అంటూ ఏడాది దాటించావు. ఇది సంసారులుండే కొంప. ఆడామగా అంతా వస్తుంటార్ట ఏమిటో నీకోసం," అంటాడా? వాడి నాలుగ తెగెయ్య. రక్తం కుత కుతా వుడికిపోయింది. నీళ్ల బిందె భుజానికెత్తుకుని వస్తున్నాన్నేను. బిందెకి బిందె నెత్తిన దిమ్మరించెయ్యాలన్నంత అసహనాన్ని అరక్షణంలో నమిలేసి,

"అయ్యో... చూళ్లేదా మీరు... ఇందాకేగా వారు వెళ్లింది..." అనేశాను.

అనలామాటే అడుగడుక్కీ తెగనరికిట్టు ముక్కలు ముక్కలుగా కూడా వచ్చింది.

ఇంటాయన మొహం వెలిగింది. ఇది నే వూహించిందే, వూహించనిదేమిటంటే-

"ఏదీ ఆ కుర్రాడా! ఆ తెల్లగళ్ల చొక్కా... స్ఫోటకం మచ్చలూ... ఇందాకా మెట్ల దగ్గర ఎదురుపడ్డాడమ్మా... అసలనుకోలేదు సుమా," అంటూ పిట్టగోడ మీంచి కిందికి తొంగిచూశాడు. తత్తరపడ్డాను. ఎవర్ని చూశాడు వీడు? అయ్యో వర్మనా! వర్మ నా తమ్ముడి ఫ్రెండు. ఏదో ఎంట్రెన్సు పరీక్ష రాయడానికొచ్చి నిన్న మధ్యాహ్నమే మా కాలేజీ వెతుక్కుంటూ వచ్చాడు. లంచ్ నాతోనే తిన్నాడు.

ఊరు కాని వూళ్లో ఎక్కడో వుండి ఇబ్బందేం పడతావ్ మా ఇంటికి రావోయ్- అంటూ మర్యాదక్కూడా నేనన్లేదు. ఏ వయసులో, వరసలో వున్న మగవాడ్నైనా సరే ఇంటికి పిల్చి ఇంటాయన చూపులకి ఎర చెయ్యడం నా కిష్టంలేదు. వర్మ నా చేతిలో మొట్టికాయలు తిని ఆల్జీబ్రా లెక్కలు నేర్చుకున్నాడు. పొద్దున్నే మళ్లీ రిఫెనెన్సు బుక్స్ కావాలంటూ వచ్చాడు. రాగలడనుకోలేదసలు. ఎక్కడి రామచంద్రాపురం? అక్కడ్నించి తెల్లారేసరికల్లా మెహదీపట్నం వచ్చాడంటే ఎన్నింటికి నిద్రలేచి వుంటాడు. జాలేసింది. కూచుంటే కదా కాస్సేపయినా. వస్తాను వస్తాను అని కాఫీ అయినా తాగకుండా ఒకటే పరుగు. నల్లా దగ్గర నీళ్లు పడుతూ నేనో పక్క అరుస్తూనే వున్నాను. వెడుతూ వెడుతూ వీడి కంట పడినట్టున్నాడు. ఇంటాయన పిట్టగోడ వదిలిపెట్టి బర్రున కుర్చీ జరుపుకుని కూర్చునేసరికి ఈ లోకం కొచ్చాను.

"కాఫీ ఇస్తానాగండి," మర్యాద చేయబోయాను.

"వొద్దుద్దు," అని తలూపి, "బొత్తిగా వరహీనంలా వున్నాడమ్మాయ్ మీ ఆయన," సంభాషణ మొదలెట్టాడు. చెప్పేద్దామనే వుంది సిన్సియర్‌గా. నాకు కేటాయించిన వరహీనుడు ఇతగాడు కాదండీ వేరే వున్నాడు అని. కానీ ఎప్పుడూ లేని ఆయన హటాత్ మర్యాద, మాటలో వున్న మన్ననా, ఎంచేతో నా నోరు నొక్కేశాయి.

'ఛీ ఛీ అబద్ధం అదేమిటి సునందా? చెప్పు! అసలు విషయం చెప్పు,' అంతరాత్మ నా చెంపలు వాయించడం మొదలెట్టింది. నాకూ చెప్పడమంటేనే ఇష్టం. కానీ నాకున్న నిజాలెలాంటివి? నా మొగుడు నాలుగేళ్లు నరకం చూపించి ఎటో పోయాడు. దగుల్బాజీ వెధవని నమ్మకంగా తేలిపోయింది. కాబట్టి ఇక రాడు. రమ్మనడు. ఇంకేమైనా వివరాలు కావాలా? అతనితో కాపురం చేస్తున్నప్పుడే ఎంత పొందిగ్గా నిశ్శబ్దంగా, గౌరవప్రదంగా కిక్కురుమనకుండా వున్నానో అతను లేనప్పుడు కూడా నా వుద్యోగం నేను చేసుకుంటూ బిడ్డను పోషించుకుంటూ నా 'ఉత్తమ గృహిణీత్వా'న్ని కాపాడుకోగల్ను. అవసరం అయితే ఏ రోజు కాండక్ట్ సర్టిఫికెట్ ఆ రోజు సమర్పించుకోగల్ను. నా వల్ల మీకెవరికీ ఎలాంటి ఇబ్బందీ రాదు. అందరితోబాటే ప్రతి నెలా ఫస్టుకే అద్దె పే చేస్తాను. నా బతుకు నన్ను బతకనివ్వండి చాలు,' అని కనీసం చచ్చేలోపు ఒక్క ఇంటి ఓనరుతో అయినా ఈ విషయాలు ఇలానే చెప్పాలని వుంది.

ఏమవుతుంది చెబితే.

ఏంకాదు. కాకపోతే వూడిపోయిన బాత్రూం తలుపుకి రిపేరు బందవుతుంది. పోస్టువాడు కిటికీ సందున గుచ్చిన ఉత్తరాలు బందవుతాయి. పాలల్లోకి తోడు బందవుతుంది. తీగమీద ఆరేసిన బట్టలు ఆచూకీ బందవుతుంది. నాకోసం ఎవరొచ్చిపోయినా అజాపజా బందవుతుంది. మానవత్వం బందవుతుంది. సంసారిని కాదేమోనన్న అనుమానంతో ఇప్పటికే అంతంత మాత్రాన వున్న మానవ సంబంధాలు పుటుక్కున తెగుతాయి. అప్పుడిక పక్కింటావిడ వాళ్లింటి చెత్తంతా సరాసరి నా వాకిట్లోకి చిమ్మేస్తుంది. క్రింద వాళ్ల మనవరాలు నేను పూయించిన గులాప్పూలతో పాటు కొమ్మలూ పీక్కుపోతుంది. ఇంటివాడు అద్దె హఠాత్తుగా పెంచేస్తాడు. లేదా పొమ్మంటాడు. ఎదురింటి సోడాబుడ్డి

కళ్లద్దాలు వెర్రినవ్వులతో పాటు సైగలు కూడా మొద లెడతాడు. నా పరిసరాలన్నీ భూకంపం వచ్చినట్టు వొణికిపోతాయి.

అప్పుడిక వాళ్ల దృష్టిలో నేనొక సిటిజన్‌ని కాదన్న మాట. నాకు పౌరహక్కులు లేవు. సమాజం లేదు. ప్రపంచం లేదు. పౌరుషం లేదు. మొగుడుంటేనే అన్నీ వున్నట్టు. మొగుడే లేకపోతే ఏమీలేనట్టే. నిజానికి నేను వాడి నుంచి వచ్చేశాకే మనిషిని కాగలిగాను. చదువు పూర్తిచేసుకుని ఓ ట్యుటోరియల్ కాలేజీలో చిరుద్యోగం సంపాయించుకోగల్గాను. నా అందమూ, గుణమూ ఎన్నివిధాల మెరుగు పెట్టుకున్నానో అన్నివిధాలా ఛీత్కా రానికి గురయ్యే క్షణక్షణాత్మహత్యల సంఘర్షణ తప్పింది. ఇంకో జన్మెత్తినంత రిలీఫ్‌గా వుంది. కానీ ఈ తృప్తీ, తిన్న తిండి వంటపట్టడమూ ఇవన్నీ ఎవరికోసమో నేనింకా పాతజన్మ వాసనలు మొయ్యాలి. అన్నిటిలోకి పరాకాష్ఠ ఏమిటంటే ఎవరి నీడ చూసి నేను అను క్షణమూ అసహ్యించుకుంటానో, మాటలతో చేతలతో పరోక్షంగా వాడి వునికి ప్రాణం పోస్తున్నాను. నేనింకా ఫలానా వాడి తాలూకాగానే గుర్తించబడుతున్నాను. ఇదంతా చాలా అసహజంగా వుందని తెలుసు. ఏ మలుపు తిప్పాలో మటుకు తెలీడంలేదు.

"ఉత్తరం రాశారా మీవారు?" ఔనన్నట్టు తలూపు తాను.

"ఈ పండక్కి కూడా మీరే వెడుతున్నారా మీవారు రారా," ఔనన్నట్టు తలూపుతాను.

"కొత్త చీరా? మీవారు కొన్నదేనా?" ఔనన్నట్టు తలూపుతాను. నా నోటితో నిజం చెప్పను. అబద్ధం కూడా చెప్పలేను. గంగిరెద్దు వేషం అలా సౌకర్యంగా వుంది. కర్రా విరగదు. పామూ చావదు. అప్పుడు మాత్రమే, ఇదిగో వదినా... చూడక్కా... విను చెల్లెమ్మా... వస్తా పిన్నమ్మా... రండి అత్తమ్మా... సర్వమానవ సంబంధాలు వర్ధిల్లుతాయి.

ఉన్నది లేనట్టూ లేనిది వున్నట్టూ నటించి, నటించి జీవితమొక పెద్ద మయసభలా మారింది. ఒక్కోసారి నేను కూడా ఈ ట్రాన్స్‌లో పడిపోతాను.

నా కోసం ఎవరో వస్తారు...

ఛీ ఎవరొస్తారు ఏం రారు...

వస్తే బావుణ్ను.

వద్దు వద్దు నాకింకే బంధాలూ వద్దు భరించిన బందిఖానాలు చాలు. ఒకవేళ పోనీ వాడు కాకపోతే ఇంకెవరైనా...

ఛీ మళ్లీనా... వాడు మటుకు మంచివాడని గ్యారంటీ ఏమిటి?... అయితే నీకిష్టమేనన్నమాట.

ఏమిటిష్టం? వూర్కో నీ బొంద.

పరిపూర్ణమైన సెక్స్... పర్వర్షన్స్ లేని సెక్స్.. ఒక్కరోజన్నా నువ్వనుభవించావా అని...

ష్, చంపకు బాబూ సెక్సా సెక్సున్నరా... తప్పా తప్పన్నరా..! పులీ-మేకా, పామూ-కప్పా, బల్లీ-పురుగూ, పేడా-పేడపురుగూ, దూడా-దూడగడ్డీ అవెంత ప్రేమించుకుంటాయో ఆ మాత్రం తెలుసులే... ఈటబుల్స్... వుయ్ ఆర్ ఆల్ ఈటబుల్స్...!

పిటీ పిటీ... పెటీ సునందా! ఆర్గాజమ్ ఊహా చిత్రమేనా!!

అబ్బబ్బబ్బా తల పగిలిపోతోంది. నువ్వూరు కుంటావా! ఒకడి మంచితనాలతో సంబరపడుతూ, చెడ్డతనాలతో చచ్చిపోడం తనకు ఇంకో సమస్యేం లేదా! కీచుగా అరిచాను. అర్ధరాత్రి నిశ్శబ్దంలో నా అరుపు నాకే వికృతంగా వినిపించింది. బల్ల మీద పాకెట్ ట్రాన్సిస్టర్ విస్తుపోయి చూస్తోంది! ట్రాన్స్...సిస్టర్ చెంప లకు ఆనించుకుని విన్నాను ఏం చెబుతుందోనని... పలికితేనా..!? వేల రాధికా... గా...ఢ్ఠిగా...ముద్దు పెట్టుకుని ముల్లు తిప్పాను. ఆ చివర్నించి ఈ చివరికి... సిలోన్ కూడా మాట్లాడదేం? సీ... లోన్...సీ... లోన్లీగా చెప్పలేనంత దుఃఖంతో గురగురలాడుతోందా!

షేమ్ షేమ్ పప్పీ షేమ్ సిస్టరు... ఛా... తప్పమ్మా... బి బ్రేవ్ మై చైల్డ్... ఇదిగో ఇటు చూడు! నువ్వెవరికీ నిజాలు చెప్పొద్దు. అబద్దాలూ చెప్పొద్దు. నువ్వు పనిచేసే కాలేజీలో నీ నిక్‌నేమ్ ఏమిటి? ఉలిపి కట్టె! కదూ. శబాష్ ఉలిపికట్టెగానే వుండు. అందరిదీ గోదారి అయినప్పుడు ఉలిపికట్టెగా వుండటంలో తప్పేంలేదు. అసలు ఒకరితో నీకున్న బంధుత్వాలతో తప్ప ఇంకెలానూ బ్రతకలేకపోవడం అదొకరకమైన అంగవైకల్యం తెలుసా!

నాలో రెండు గొంతులు ఎప్పుడూ కలహించు కుంటూనే వుంటాయి. మాటల ఈటెలు విసురు కుంటూనే వుంటాయి. ఒక గొంతు చదువు, తెలివి, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం వున్నది. మరో గొంతు ఉత్త ఆడది. తరతరాల అనాది. కట్టుకథలతో రాజీపడేది. రాజీపడ్డమే దైవత్వమనుకునేది.

రెండు గొంతులూ రెండు బలమైన సర్పాల్లా బుసలు కొడతాయి.

రెండు గొంతులూ రెండు బలహీనమైన నలికెల పాముల్లా చుట్టుకుంటాయి.

వాటికి బెదరి నేనెప్పుడూ పనిలోకి పారిపోతాను. నిద్రలోకి పారిపోతాను. చవకబారు నవలల్లోకో, సినిమాల్లోకో పారిపోతాను. ఆత్మవంచనలోకి పారిపోతాను.

రెండు గొంతుల్నీ దేనికది విడదీసి విసిరేసి శాంతిగా బతకాలనుకుంటానా ఛస్తే సాధ్యం కాదు.

అదిగో అలాంటప్పుడే నన్నెవరో డిస్టర్బ్ చేస్తారు.

'సునందా అన్నం తింటున్నావా?' ఔనంటాను.

'సునందా గంగలో దూకుతావా?' ఓ.కే. అంటాను.

'సునందా నెలాఖరుదాకా టైమిస్తున్నాం నీ తాలూకు తండ్రో, భర్తో, అన్నో, కొడుకో ఎవరో ఒక మగతోడు కనిపించకపోయారో వెంటనే ఖాళీ చేయాల్సి వుంటుంది.' సరే అంటాను. కాకితో పాటు కావ్ కావ్ అంటూ, కుక్కతో పాటు భౌ భౌ అంటూ, కప్పతో పాటు బెక బెకమంటూ వాదనకి దిగాలనిపించదు. అసహాయతో! అనాసక్తో! తరచి చూసే ఓపిక్కూడా లేదు. ఎందుకంటే తెల్లారుతూనే క్లాసుంది నాకు.

ఈ ప్రపంచంలో స్త్రీకి స్వేచ్ఛ వుందనీ, సమానత్వం వుందనీ, ఎక్కడ స్త్రీలు గౌరవించబడుతున్నారో అక్కడ దేవతలు పూజింపబడతారనీ సవాలక్ష కబుర్లతో విజృంభించి పోవాలికదా మరి.

*ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, 2 జనవరి 1994*

